## లారీని ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు







## చైన్ స్నాచర్ల హల్‌చల్



AKSHARA TODAY

# అక్షర టుడే

TOWARDS... TRUTH. TRUST. TREND

www.aksharatodaynews.com


## కలెక్టర్‌ను కలిసిన డీఎఫ్‌వో



**అక్షరటుడే, కామారెడ్డి:** కామారెడ్డి అటవీశాఖ అధికారిగా నియమితులైన నీరజ్ కుమార్.. కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్‌ను గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టర్‌కు పూలమొక్క అందజేశారు. ఆసిఫాబాద్ జిల్లా ఫారెస్ట్ ఆఫీసర్‌గా విధులు నిర్వహించి బదిలీపై కామారెడ్డి జిల్లా అటవీ శాఖ అధికారిగా నియమితులయ్యారు. జిల్లాలో అటవీ సంరక్షణ, వనమహోత్సవ కార్యక్రమాల నిర్వహణ, వన్యప్రాణుల సంరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై కలెక్టర్‌తో ఆయన చర్చించారు. ఇక్కడ అటవీశాఖ అధికారిగా పనిచేసిన నిఖిత బదిలీపై వెళ్లారు.





## జాబ్ మేళాలను యువత సద్వినియోగం చేసుకోవాలి

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ :** జాబ్ మేళాలను యువత సద్వినియోగం చేసుకోని ఉద్యోగాలు సాధించాలని ఎమ్మెల్యే భూపతిరెడ్డి, కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. జిల్లా యువజన క్రీడాశాఖ ఆధ్వర్యంలో గురువారం నగరంలోని శ్రీరామ గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన జాబ్ మేళాను ప్రారంభించారు. ఉమ్మడి జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో యువత జాబ్ మేళాకు తరలివచ్చారు. 71 కంపెనీల ద్వారా సుమారు 2000 మందికి ఉద్యోగాలు కల్పించబడ్డాయని నిర్వాహకులు ప్రకటించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రూరల్ ఎమ్మెల్యే వివిధ కంపెనీలలో ఉద్యోగాల కోసం ఎంపికైన వారికి నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ ఛైర్మన్ తాహెర్ బిన్ హందాన్, అదనపు కలెక్టర్ దిలీప్ కుమార్, నిజామాబాద్ మార్కెట్ కమిటీ ఛైర్మన్ ముప్ప గంగారెడ్డి, డీవైఎస్‌వో పవన్ కుమార్, పరిశ్రమల శాఖ జిల్లా మేనేజర్ సురేష్ కుమార్, ఎన్ఐసీ అధికారి మధు, ఈడీఎం కార్తీక్, వంశీధర్ రెడ్డి, టాస్క్ అధికారులు, ఆయా కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

**కామారెడ్డి ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో రోగులు నానా ఇబ్బందులు పడుతున్నారు. వైద్యం కోసం వచ్చే వారికి కనీస సౌకర్యాలు కరువవుతున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా పేద, మధ్య తరగతి ప్రజలు ఎక్కువగా ఆధారపడే ఈ ఆస్పత్రిలో సమస్యలు తిష్టవేశాయి. అయినా అధికారులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలున్నాయి.**

- అక్షరటుడే, కామారెడ్డి




# జీజీహెచ్‌లో రోగుల ఇక్కట్లు

■ ఇతర ఆస్పత్రులకు గర్భిణుల రిఫర్ ■ ముఖ్యమైన పరీక్షలు బయటకే.. ■ పార్కింగ్ సౌకర్యం కరువు

కాన్పు కోసం జీజీహెచ్‌కు వచ్చే గర్భిణులను సిబ్బంది ఇతర ప్రైవేట్ ఆస్పత్రులకు రిఫర్ చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అత్యవసర పరిస్థితుల్లో సైతం సరైన వైద్యం అందక ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్న ఘటనలు ఉన్నాయని బాధితులు వాపోతున్నారు. రాత్రి పూట ఆస్పత్రికి వచ్చే గర్భిణుల బాధ వర్ణనాతీతం. డెలివరీ డేట్ కంటే ముందే నొప్పులు వస్తే వారిని ఇంకా సమయం ఉందంటూ సిబ్బంది వెయిట్ చేయిస్తున్నారు. ఇలాంటి సమయంలో పలువురు శిశువులు చనిపోయిన ఘటనలు కూడా ఉన్నాయి.

### పార్కింగ్ తిప్పలు

ఆస్పత్రికి వచ్చే రోగులు, వారి బంధువుల వాహనాలు పార్కింగ్‌కు స్థలం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆస్పత్రికి సంబంధించిన అంబులెన్సులు సైతం సరిగ్గా తిరగలేని పరిస్థితి నెలకొంది. రోగుల బంధువులు సరైన పార్కింగ్ స్థలం లేకపోవడంతో వాహనాలను రోడ్డుపై నిలపాల్సి వస్తోంది. దీంతో ట్రాఫిక్ సమస్యతో పాటు వాహనాలు చోరీకి గురవుతాయనే భయం వెంటాడుతోంది.

### పరీక్షలు బయటకే..

ఆస్పత్రిలో ముఖ్యమైన రక్త పరీక్షలు, స్కానింగ్‌లు, ఎక్స్‌రే వంటి సౌకర్యాలు ఉన్నప్పటికీ పలు పరీక్షల కోసం రోగులను బయటకు పంపుతున్నారు. ముఖ్యంగా సిటీ స్కాన్, ఎంఆర్ఐ, డెంగ్యూ లాంటి పరీక్షల కోసం బయట ప్రైవేట్ ల్యాబ్‌లకు వెళ్లాల్సిందే. ప్రభుత్వ ఆస్పత్రిలో ఉచితంగా జరగాల్సిన పరీక్షలకు బయట వేల రూపాయలు ఖర్చు చేయాల్సి వస్తోందని పేద రోగులు ఆవేదన చెందుతున్నారు.

### జులైలో ఆస్పత్రి షిఫ్టింగ్

జీజీహెచ్‌ను జులైలో నూతన మెడికల్ కళాశాల భవనంలోకి మార్చనున్నారు. షిఫ్టింగ్ ప్రక్రియ నేపథ్యంలో ప్రస్తుత భవనంలో మౌలిక సదుపాయాలపై అధికారులు దృష్టి సారించడం లేదనే విమర్శలు వస్తున్నాయి. అయితే ఆస్పత్రి మొత్తాన్ని మెడికల్ కళాశాలకు షిఫ్ట్ చేయడం కన్నా ఎంసీహెచ్ ఇక్కడే ఉంచి పోస్టుమార్టం సహా మిగతా విభాగాలను మెడికల్ కళాశాలకు మార్చాలని ప్రజలు కోరుతున్నారు. కొత్త భవనంలోకి మారిన తర్వాతనైనా రోగులకు మెరుగైన సేవలు అందుతాయని ప్రజలు ఆశిస్తున్నారు.

### రిపోర్టులు బంద్

కామారెడ్డి జీజీహెచ్‌లో గత మూడు రోజులుగా ల్యాబ్‌లో ప్రింటర్ చెడిపోవడంతో రోగులకు రిపోర్టులు ఇవ్వడం నిలిచిపోయింది. సిబ్బంది పట్టించుకోకపోవడంతో వైద్యం కోసం ఎదురుచూస్తున్న రోగులకు తీవ్ర జాప్యం జరుగుతోంది. రిపోర్టు లేకపోతే డాక్టర్లు మందులు రాయకపోవడంతో రోగులు ఆస్పత్రి చుట్టూ తిరగాల్సి వస్తోంది. గురువారం ఈ సమస్యను 'అక్షరటుడే' వెబ్ సైట్ లో ప్రచురించడంతో అప్పటికప్పుడు టెక్నీషియన్‌ను పిలిచి ప్రింటర్ బాగు చేయించారు.



## సబ్ జూనియర్ అథ్లెటిక్స్ పోటీల్లో గాంధారి క్రీడాకారిణి కి బంగారు పతకం..

**అక్షరటుడే, గాంధారి:** కామారెడ్డి జిల్లాస్థాయి సబ్ జూనియర్ అథ్లెటిక్స్‌లో గాంధారి మండల క్రీడాకారిణి ప్రతిభ చూపింది. 60 మీటర్ల పరుగు పందెంలో మండలంలోని సోమారం తండాకు చెందిన సాయి చెల్సియా రాథోడ్ బంగారు పతకం సాధించినట్లు ఆమె తండ్రి వాలీబాల్ కోచ్ లక్ష్మణ్ రాథోడ్ తెలిపారు. గురువారం జిల్లా కేంద్రాల్లోని ఇందిరాగాంధీ క్రీడామైదనంలో జరిగిన పోటీల్లో 10 సెకన్లలో పరుగు పందెం పూర్తి చెసినట్లు ఆయన తెలిపారు. గెలుపొందిన ఆమెకు జిల్లా అథ్లెట్ అసోసియేషన్ అధ్యక్షుడు జైపాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్ సంయుక్త కార్యదర్శి శ్రీనివాస్, పేట జిల్లా ప్రధాన కార్యదర్శి మధుసూదన్ బహుమతి ప్రధానం చేశారన్నారు.



## స్వీయగణనలో పాల్గొన్న రెవెన్యూ ఉద్యోగులు

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** జనాభా గణన2027లో భాగంగా కొనసాగుతున్న 'స్వీయ గణన' ప్రక్రియ కొనసాగుతోంది. దీంట్లోభ భాగంగా బుధవారం కలెక్టరేట్‌లో రెవెన్యూ ఉద్యోగులు స్వీయ నమోదు చేసుకున్నారు. ఉద్యోగులు ఎవరికి వారు తమ కుటుంబ వివరాలను పోర్టల్‌లో నమోదు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఉద్యోగులను అభినందించారు. మిగితా శాఖల ఉద్యోగులు కూడా వీరిని స్ఫూర్తిగా తీసుకుని స్వీయగణన చేసుకోవాలని సూచించారు. ఈసారి జనాభా గణన2027 డిజిటల్ విధానంలో నిర్వహించబడుతోందని తెలిపారు. ఈనెల 10వ తేదీ వరకు పోర్టల్ ద్వారా స్వీయ నమోదు చేసుకోవచ్చని సూచించారు. స్మార్ట్ ఫోన్, కంప్యూటర్ ద్వారా https://se.census.gov.in వెబ్‌సైట్‌లోకి వెళ్లి స్వీయ గణన చేసుకోవచ్చని అన్నారు. నమోదు అనంతరం ప్రతి వ్యక్తికి యూనిక్ ఐడీ వస్తుందని, దానిని ఇంటికి వచ్చే ఎన్యూమరేటర్‌కు అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో రెవెన్యూ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు రమణ్ రెడ్డి, శ్రీనివాస్ రావు, కలెక్టరేట్ ఏవో ప్రశాంత్, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు బాలరాజ్ పాల్గొన్నారు.

## ట్రాఫిక్ సిబ్బంది కోసం ఐల్యాండ్స్ వద్ద ఫాగింగ్ మిస్ట్ యంత్రాలు: సీపీ

**అక్షరటుడే, నిజామాబాద్ క్రైం:** వేసవికాలంలో ట్రాఫిక్ సిబ్బంది కోసం ఐల్యాండ్ వద్ద ఫాగింగ్ మిస్ట్ యంత్రాలు ఏర్పాటు చేయించినట్లు సీపీ సాయిచైతన్య పేర్కొన్నారు. ఈ మేరకు నగరంలో యంత్రాలను ఆయన గురువారం ప్రారంభించారు. వేసవికాలంలో ట్రాఫిక్ సిబ్బంది ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని పలు కూడళ్ల వద్ద ఫాగింగ్ మిస్ట్ యంత్రాలను ఏర్పాటు చేయించామన్నారు. కోర్ట్ సర్కిల్ వద్ద ఏర్పాటు చేసిన మిస్ట్‌ను పరిశీలించి.. పనితీరుపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మిస్ట్ యంత్రాల ద్వారా సుమారుగా మూడు నుంచి నాలుగు డిగ్రీల వరకు ఉష్ణోగ్రతను తగ్గించుకోవచ్చన్నారు. తద్వారా వేసవి నుంచి కాస్త ఉపశమనం లభిస్తుందని తెలిపారు. అదేవిధంగా ట్రాఫిక్ సిబ్బందికి ఆరోగ్య రీత్యా ఎదురయ్యే ఇబ్బందులకు రాబోయే రోజుల్లో తగుచర్యలు తీసుకుంటామన్నారు. ఈ యంత్రాలను ఏర్పాటు చేయడానికి సహకరించిన వాసవి క్లబ్ వారికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, అశోక్ సిబ్బంది అనిల్, రహీం, నరేష్ షాకీర్, గాంధీ, శంకర్ పాల్గొన్నారు.






## ఎమ్మెల్యే జోక్యంతో ధాన్యం తరలింపు సమస్యకు పరిష్కారం

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** ఎల్లారెడ్డి నియోజకవర్గంలో ధాన్యాన్ని రైస్‌మిల్లులకు తరలించే ప్రక్రియలో విపరీతమైన జాప్యం ఏర్పడుతోంది. కొనుగోళ్లు పూర్తయినప్పటికీ ధాన్యం తరలించేందుకు లారీల కొరత కారణంగా ఇబ్బందులు వస్తున్నాయి. ధాన్యం తరలింపులో జరుగుతున్న జాప్యంపై నాయకులు ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు దృష్టికి తీసుకొచ్చారు. దీంతో స్పందించిన ఆయన జిల్లా సివిల్ సప్లయ్స్ అధికారి తో గురువారం చర్చించారు. ప్రస్తుతం కొనుగోలు చేసిన ధాన్యానికి ఒకే రైస్ మిల్లును కేటాయించడంతో అక్కడ తీవ్ర రద్దీ ఏర్పడిందని, దీంతో లారీలు రోజుల తరబడి రోడ్డుపైనే వేచి ఉండాల్సి వస్తోందని ఆయన అన్నారు. దీంతో లారీ డ్రైవర్లు, కార్మికులు, రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన అధికారులకు వివరించారు. సమస్యను వెంటనే పరిష్కరించేందుకు ధాన్యాన్ని ఒకే మిల్లుకు కాకుండా మరిన్ని రైస్ మిల్లులకు కేటాయించాలని డీసీఎస్‌వోకు ఎమ్మెల్యే సూచించారు. దీనివల్ల ధాన్యం క్లియరెన్స్ వేగంగా జరిగి రైతులు, లారీ యజమానులు, కార్మికులకు ఉపశమనం కలుగుతుందని తెలిపారు.

## ఇందిరమ్మ ఇళ్లతో సొంతింటి కల సాకారం: షబ్బీర్ అలీ



**అక్షరటుడే, కామారెడ్డి:** ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంతో పేదల సొంతింటి కల సాకారం అవుతుందని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ అన్నారు. గురువారం ఆయన మున్సిపల్ పరిధిలోని టేక్రియాల్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇందిరమ్మ లబ్ధిదారులకు దుస్తులను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పేద ప్రజల సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తోందన్నారు. ఎన్నో ఏళ్లుగా సొంతిల్లు లేక అద్దె ఇళ్లలో ఇబ్బందులు పడుతున్న పేద కుటుంబాలకు ఇప్పుడు ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా గౌరవప్రదమైన జీవనం అందుతోందని తెలిపారు. ఇల్లు అనేది ప్రతి కుటుంబానికి ఒక భద్రత, ఒక ఆత్మగౌరవమని, ఆ గౌరవాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి పేద కుటుంబానికి అందించేందుకు కట్టుబడి ఉందని పేర్కొన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో సమాన ప్రాధాన్యతతో ఇళ్ల నిర్మాణ కార్యక్రమాలు కొనసాగుతున్నాయని చెప్పారు. కామారెడ్డి మున్సిపాలిటీలో నూతనంగా ఎన్నికైన కో ఆప్షన్ సభ్యులను ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ సన్మానించారు. కాంగ్రెస్ పార్టీ నుంచి గోనె సునీత, అస్మా ముబషీర్, అలిబిన్ అబ్దుల్లాలను అభినందించారు. ఈ సందర్భంగా షబ్బీర్ అలీ మాట్లాడుతూ.. కామారెడ్డి మున్సిపాలిటీని కాంగ్రెస్ పార్టీ ఇప్పటికే కైవసం చేసుకుందని, ఇప్పుడు కో-ఆప్షన్ స్థానాల్లో కూడా ప్రజలు కాంగ్రెస్‌కు మద్దతుగా తీర్పు ఇచ్చారన్నారు. పొత్తు ధర్మాన్ని గౌరవిస్తూ ఒక కో-ఆప్షన్ స్థానాన్ని బీఆర్ఎస్‌కు కేటాయించామని పేర్కొన్నారు. కామారెడ్డిని రాష్ట్రంలోనే ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో డీసీసీ మాజీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాసరావు, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు ఐరేని సందీప్, గ్రంథాలయ ఛైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి, మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇప్ప ఉమా శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షులు పండ్ల రాజు, రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకుడు మహమ్మద్ ఇలియాస్ , గంప ప్రసాద్, పాత దివ్య, రవి పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

## ఎల్లారెడ్డి ఎస్సైగా రాజు బాధ్యతల స్వీకరణ



**అక్షరటుడే,ఎల్లారెడ్డి:** ఎల్లారెడ్డి పోలీస్ స్టేషన్ ఎస్సైగా రాజు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు రాజంపేట పోలీస్ స్టేషన్‌లో ఎస్సైగా విధులు నిర్వహించిన ఆయన సాధారణ బదిలీల్లో భాగంగా ఎల్లారెడ్డికి బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేసిన ఎస్సై మహేష్ రాజంపేటకు బదిలీ అయ్యారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఎస్సై రాజు మాట్లాడుతూ ఎల్లారెడ్డి మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు. నేరాల నియంత్రణ, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, మహిళలు, చిన్నారుల రక్షణకు ప్రాధాన్యం ఇస్తామని పేర్కొన్నారు. ప్రజలకు ఎలాంటి సమస్యలున్నా నిర్భయంగా ఠాణాకు వచ్చి ఫిర్యాదు చేయాలన్నారు. రాత్రి వేళల్లో గస్తీని మరింత పటిష్టం చేస్తామని, రౌడీషీటర్లు, పాత నేరస్థుల కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచుతామని తెలిపారు.

## తెలంగాణాలోనూ త్వరలో 'డబుల్ ఇంజిన్ సర్కార్' : దినేష్ కులాచారి




**అక్షరటుడే, ఇందూరు:** తెలంగాణాలోనూ త్వరలో 'డబుల్ ఇంజిన్ సర్కార్' రాబోతుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి అన్నారు. నగరంలోని పార్టీ కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా దినేష్ కులాచారి మాట్లాడుతూ.. మూడోసారి ప్రధానమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత ప్రధాని మోదీ తొలిసారిగా తెలంగాణ పర్యటనకు విచ్చేస్తున్నారన్నారు. మే 10వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగే మోదీ బహిరంగ సభకు ఇందూరు జిల్లా నుంచి ఎంపీ అర్వింద్ ఆధ్వర్యంలో సుమారు 15వేల మంది అభిమానులు, కార్యకర్తలు తరలి వెళ్లనున్నారన్నారు. పశ్చిమ బెంగాల్, అస్సాం, పాండిచ్చేరి తరహాలోనే తెలంగాణలో కూడా 'డబుల్ ఇంజన్ సర్కార్' ఉంటేనే వేగవంతమైన అభివృద్ధి సాధ్యమని ప్రజలు బలంగా విశ్వసిస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం డబుల్ బెడ్ రూం ఇళ్ల కోసం ఒక్కో ఇంటికి రూ.1,60,000తో పాటు ఈజీఎస్ కింద మరో రూ.60,000.. మొత్తంగా రూ.2,20,000 అందిస్తోందన్నారు. కేంద్రం ఇస్తున్న నిధులను రాష్ట్ర ప్రజలకు ఇస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం తన వంతుగా ఒక్క రూపాయి కూడా ఇవ్వట్లేదన్నారు. గ్రామ పంచాయతీల అభివృద్ధి కోసం కేంద్రం నేరుగా సర్పంచుల ఖాతాల్లో వేస్తున్న నిధులను, రాష్ట్ర ప్రభుత్వం తన ఖజానా ఖాళీ అవ్వడంతో అక్రమంగా ఫ్రీజ్ చేసి మళ్లించుకుంటోందని దుయ్యబట్టారు. పశ్చిమ బెంగాల్ ఎన్నికల ఫలితాలను చూసిన ప్రస్తుత రేవంతుద్దీన్ ప్రభుత్వం భయపడుతోందని దినేష్ వ్యాఖ్యానించారు. అందుకే రాష్ట్రంలో లోకల్ బాడీ ఎన్నికలు నిర్వహించడానికి వెనుకాడుతోందన్నారు. ఈ చారిత్రాత్మక బహిరంగ సభకు నిజామాబాద్ జిల్లాలోని బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు పోతన్‌కర్ లక్ష్మీనారాయణ, నాగోళ్ల లక్ష్మీనారాయణ, న్యాలం రాజు, ప్రమోద్ కుమార్, నాయిడి రాజన్న, బద్దం కిషన్, పుట్ట వీరేందర్, బీలోజి నాయక్, అనంతరెడ్డి, పడాల భూపతి, అంబదాస్ రావు, పసునూరి రమేష్, ఇప్పాకాయల కిషోర్, యాదాల నరేష్, అమంద్ విజయ్ కృష్ణ, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.



## భవన నిర్మాణ కార్మికులు లేబర్ కార్డు ద్వారా సంక్షేమ ఫలాలు పొందాలి

**అక్షరటుడే, బాన్సువాడ:** భవన నిర్మాణ కార్మికులు లేబర్ కార్డు ద్వారా కల్పించే సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా సహాయ కార్మిక శాఖ అధికారి ఎం.శశికుమార్ పిలుపునిచ్చారు. పట్టణంలోని ఏఐటీయూసీ కార్యాలయం వద్ద కార్మిక శాఖ ఆధ్వర్యంలో గురువారం భవన నిర్మాణ కార్మికుల అవగాహన సమావేశం నిర్వహించారు. తెలంగాణ భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దుబాస్ రాములు అధ్యక్షత వహించిన కార్యక్రమంలో లేబర్ అధికారి మాట్లాడుతూ.. ఈనెల 1వ తేదీ నుంచి 10వ తేదీ వరకు కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ద్వారా అందిస్తున్న పథకాలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో బాన్సువాడ సహాయ కార్మిక శాఖ అధికారి ఇబ్రహీం జుబేర్ కార్మిక శాఖ జూనియర్ అసిస్టెంట్లు సతీష్ రెడ్డి, దావుద్, తాపీ మేస్త్రీ సంఘం నాయకులు గడ్డి వెంకటేశ్వర్లు, తోట శ్రీనివాస్, సర్దార్, ఏఐటీయూసీ నాయకులు శంకర్, కమ్మరి రాములు, నల్ల గంగాధర్, నీలి శంకర్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

## సోలార్ విద్యుత్ వినియోగాన్ని ప్రోత్సహించాలి



**అక్షరటుడే, ఆర్మూర్ :** సోలార్ విద్యుత్ వినియోగంపై అవగాహన పెంచుకుని ఇతరులను ప్రోత్సహించాలని ఏఈ శ్రావణ్‌కుమార్ పేర్కొన్నారు. ఆలూర్‌లో ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో విద్యుత్ వినియోగదారులకు సోలార్ విద్యుత్ వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం పెరుగుతున్న విద్యుత్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని సోలార్ విద్యుత్ వినియోగంపై ప్రతిఒక్కరూ అవగాహన పెంచుకోవాలన్నారు. గృహాలు, వ్యవసాయ అవసరాలకు సోలార్ వ్యవస్థలను వినియోగించడం ద్వారా విద్యుత్ ఖర్చులు తగ్గడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు కూడా తోడ్పాటు అందుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఆర్మూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ వైఎస్ మల్లారెడ్డి, కిసాన్ సెల్ అధ్యక్షుడు బార్ల ముత్యం, లైన్‌మన్ గంగాధర్, నరేష్, ప్రవీణ్, పురుషోత్తం, విద్యుత్ శాఖ సిబ్బంది, గ్రామ ప్రజలు, రైతులు నాయకులు పాల్గొన్నారు.




# విక్రయానికి అవస్థలు..

■ యాసంగి రైతుల్లో ఓవైపు ఆనందం.. మరోవైపు నిర్వేదం.. ■ వేగంగా సాగని కొనుగోళ్లు ■ అధికారులు చర్యలు తీసుకోవాలంటున్న రైతులు

కామారెడ్డి జిల్లావ్యాప్తంగా ఈ సీజన్‌లో సుమారు 2.57 లక్షల ఎకరాల్లో వరి పంట సాగు కాగా.. దాదాపు 6 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు. దీనికి తగ్గట్టుగా జిల్లాలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం, ఐకేపీ, మార్కెటింగ్ సంస్థ ఆధ్వర్యంలో 150 వరకు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. అయినా కొనుగోళ్లు వేగంగా సాగకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

### ఎకరాకు 25 నుంచి 37 క్వింటాళ్ల దిగుబడి..

గత యాసంగిలో వరిపంటను సాగుచేసిన రైతులకు ఎకరాకు కేవలం 12 నుంచి 15 క్వింటాళ్ల దిగుబడి మాత్రమే వచ్చింది. మొగి పురుగు, మెడవిరుపు తెగుల్ల ప్రభావంతో పంట దిగుబడి గణనీయంగా పడిపోయింది. దీంతో కనీసం పెట్టుబడి ఖర్చులు సైతం దక్కలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అయితే ఈసారి యాసంగిలో వాతావరణం అనుకూలించడంతో పాటు చీడపీడలు ఆశించిన స్థాయిలో రాకపోవడంతో దిగుబడులు ఆశాజనకంగా వచ్చాయి. ప్రస్తుతం ఎకరాకు సగటున 25 నుంచి 37 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తోందని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఖరీఫ్‌లో పంట చేతికి వచ్చే సమయంలో కురిసిన భారీ వర్షాలతో ఆశించిన స్థాయిలో దిగుబడులు రాలేదని, యాసంగి మాత్రం కలిసొచ్చిందని అన్నదాతలు అంటున్నారు.

### విక్రయాలకు ఇబ్బందులు

ప్రస్తుతం హార్వెస్టర్లతో కోతలు, ట్రాక్టర్లతో ధాన్యం తరలింపు జోరుగా సాగుతోంది. కొనుగోలు కేంద్రం వద్ద ధాన్యం కుప్పలు పోసి రోజులు గడుస్తున్నా విక్రయాలు ఆశించిన రీతిలో సాగట్లేదని రైతులు పేర్కొంటున్నారు. ఎండకు ఎండబోసిన ధాన్యం రైస్‌మిల్లులకు చేరేసరికి బరువు మరింత తగ్గడంతో మిల్లింగ్ వద్ద వ్యాపారులు పేచీలు పెడుతున్నారని వాపోతున్నారు. మద్దతు ధరతో పాటు దిగుబడి కూడా బాగా రావడంతో రైతులంతా ఆనందంగా ఉన్నప్పటికీ వచ్చిన ధాన్యం విక్రయాలకు ఇబ్బందులు పడాల్సి వస్తుందని కర్షకులు కన్నీరు పెడుతున్నారు. లారీలు సక్రమంగా రాకపోవడంతో పాటు రైస్‌మిల్ వద్ద ఇబ్బందులు నెలకొంటున్నాయన్నారు. కొనుగోళ్లు వేగంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని రైతుల కోరుతున్నారు.

### 37 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది

యాసంగి రైతులకు కలిసొచ్చింది. ఎకరానికి 37 క్వింటాళ్ల వడ్లు వచ్చాయి. గత ఖరీఫ్‌లో వర్షాలు ఎక్కువగా కురవడంతో వడ్లు తడిసి కొంతమేర నష్టపోయాను. అంతకుముందు పంటను మొగ్గపురుగు ఆశించడం వల్ల దిగు బడి సరిగ్గా రాలేదు. ఈసారి మాత్రం దిగుబడులు బాగున్నాయి. కానీ కొనుగోళ్లు వేగంగా జరగడం లేదు. అసలే ఎండాకాలం కావడంతో అవస్థలు పడాల్సి వస్తోంది. అధికారులు ధాన్యం త్వరగా కొనుగోలు చేయాలి

– **రాజాగౌడ్, రైతు, పరమళ్ల గ్రామం**

## పోగొట్టుకున్న సెల్‌ఫోన్ల రికవరీ



**అక్షరటుడే, ఆర్మూర్:** పట్టణంలో ఇటీవల పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను రికవరీ చేసినట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ గౌడ్ పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం వివరాలు వెల్లడించారు. పట్టణంలో నలుగురు బాధితులు పూర్ణచందర్, సత్యనారాయణ, వంశీ, ఉష తమ ఫోన్లు పోగొట్టుకున్నట్లు ఫిర్యాదు చేశారన్నారు. వారి ఇచ్చిన వివరాలతో సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫోన్లను రికవరీ చేశామన్నారు. ఈ సందర్భంగా గురువారం వాటిని అందజేసినట్లు తెలిపారు.

## రోడ్లపై తోపుడు బండ్లు నిలిపితే కఠినచర్యలు




**అక్షరటుడే, ఆర్మూర్:** రోడ్లపై తోపుడుబండ్లు నిలిపితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆర్మూర్ పోలీసులు హెచ్చరించారు. ఈ మేరకు పట్టణంలో గురువారం రోడ్లపై ట్రాఫిక్‌కు ఇబ్బందిగా మారిన పలు తోపుడు బండ్లు, దుకాణాల బోర్డులను తొలగించారు. మరోసారి రోడ్లపై దుకాణాలకు సంబంధించి వస్తువులు ఉంచినా.. బోర్డులు పెట్టినా చర్యలు తప్పవని వారు హెచ్చరించారు.

## ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** ప్రభుత్వ పథకాలను రైతులు వినియోగించుకుంటూ అభివృద్ధి సాధించాలని మార్కెట్ కమిటీ ఛైర్మన్ రజిత వెంకటరామిరెడ్డి అన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా మీసన్‌పల్లి రైతుకు వేదిక వద్ద వ్యవసాయ విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో గురువారం రైతు వారోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక నిర్వహించడం రైతులకు ఎంతో ఉపయోగకరమన్నారు. కాంగ్రెస్ మండaeధ్యక్షుడు కూరుమ సాయిబాబా మాట్లాడుతూ రైతులందరూ రైతు వారోత్సవాల్లో పాల్గొని తమ సమస్యలను పరిష్కరించుకోవాలని తెలిపారు. విద్యుత్ శాఖ డీఈ విజయసారథి మాట్లాడుతూ రైతులకు ఉచిత విద్యుత్‌తో పాటు విద్యుత్‌శాఖ ద్వారా పలు పథకాలు అందజేస్తుందని వారిని వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో మన గ్రోమోర్ ఇన్‌ఛార్జి ప్రేమ్‌దాస్, సర్పంచ్ బోనాల మైసయ్య, ఎల్లారెడ్డి సొసైటీ ఛైర్మన్ ఏగుల నర్సింలు, విద్యుత్ శాఖ ఏఈ వెంకటస్వామి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ నాగం శంకరయ్య, మన గ్రోమోర్ ప్రతినిధులు, మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ వెంకటరామిరెడ్డి, ఎస్‌ఎన్ రెడ్డి, మైపాల్ రెడ్డి, ఏఈవోలు ముఖిద్, రాజాగౌడ్ పాల్గొన్నారు.

## స్వీయ జనగణనను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

**అక్షరటుడే, బాల్కొండ:** కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు జనగణన-2027లో భాగంగా స్వీయ జనగణన ప్రక్రియను ప్రారంభించినట్లు బాల్కొండ ఛార్జ్ ఆఫీసర్, తహశీల్దార్ శ్రీనివాస్ తెలిపారు. మండల అభివృద్ధి అధికారి కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జనగణనను రెండు విడతలుగా నిర్వహించనున్నట్లు చెప్పారు. మొదటి విడతగా స్వీయ గణన, అనంతరం ఇళ్లవారీగా గణన చేపడతామని తెలిపారు. అడిషనల్ ఛార్జ్ ఆఫీసర్, మండల విద్యా శాఖ అధికారి బట్టు రాజేశ్వర్ మాట్లాడుతూ ఏప్రిల్ 26 నుంచి మే 10 వరకు స్వీయ గణన కొనసాగుతుందని పేర్కొన్నారు. మే 11 నుంచి జూన్ 9 వరకు హౌస్ లిస్టింగ్, హౌస్ సెన్సస్ నిర్వహిస్తామని, 2027 ఫిబ్రవరి 9 నుంచి 28 వరకు పూర్తి జనగణన చేపడతామని వివరించారు. ప్రజలు అధికారిక వెబ్‌సైట్ https://sc.census.gov.in ద్వారా తమ వివరాలను స్వయంగా నమోదు చేసుకోవాలని సూచించారు. స్వీయ గణన పూర్తి చేసిన తర్వాత వచ్చే ఎస్‌ఈఐడీని ఎన్యూమరేటర్‌కు చూపిస్తే నమోదు సులభంగా పూర్తవుతుందని చెప్పారు. ఈ సమావేశంలో మండల అభివృద్ధి అధికారి విజయభాస్కర్ రెడ్డి, మండల స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## ఉపాధిహామీ కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మందుల పంపిణీ



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** అన్నాసాగర్ గ్రామంలో ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు సర్పంచ్ స్రవంతి సాయగౌడ్ ఓఆర్ఎస్ ప్యాకెట్లు, అత్యవసర మందులను గురువారం పంపిణీ చేశారు. ఎండల తీవ్రత నేపథ్యంలో కూలీల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. వడదెబ్బ బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కూలీలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ జి.నాగరాజు, టెక్నికల్ అసిస్టెంట్, ఫీల్డ్ అసిస్టెంట్, ఆశా వర్కర్ పద్మ, పంచాయతీ కార్యదర్శి, కారోబార్ సంగారెడ్డి పాల్గొన్నారు. వేసవిలో ప్రతి కూలీ ఓఆర్ఎస్ ద్రావణాన్ని వినియోగించుకోవాలని.. అనారోగ్యంగా ఉంటే వెంటనే సమాచారం ఇవ్వాలని సర్పంచ్ సూచించారు.

## కల్లెడలో విషాదం.. ఉరి వేసుకుని యువతి బలవన్మరణం



**అక్షరటుడే, ఆర్మూర్:** ఆలూర్ మండలం కల్లెడలో విషాదం చోటు చేసుకుంది. ఉరి వేసుకుని ఓ యువతి బలవన్మరణం చెందింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆలూర్ మండలం కల్లెడ గ్రామానికి చెందిన కునాల శివాని (31) టీటీసీ పూర్తిచేసి ఉద్యోగ పరీక్షలకు సిద్ధమవుతూ ఇంటి వద్దే ఉండేది. పెళ్లి సంబంధాలు కుదరకపోవడంతో కొంతకాలంగా మనస్తాపానికి గురైనట్లు సమాచారం. ఈ క్రమంలో బుధవారం రాత్రి గదిలో నిద్రించేందుకు వెళ్లిన శివాని.. ఉదయం ఎంతసేపటికీ బయటకు రాకపోవడంతో కుటుంబ సభ్యులు గమనించగా ఆమె ఉరి వేసుకుని ఉంది. వెంటనే వారు పోలీసులకు సమాచారం అందించారు. మృతురాలి తండ్రి కునాల హన్మాండ్లు ఫిర్యాదు మేరకు ఆర్మూర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఘటనతో గ్రామంలో విషాదం నెలకొంది.

## కారు ఢీకొని చిన్నారి దుర్మరణం

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** రూరల్ ప్రాంతంలోని చక్రధర్‌నగర్ తండాలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. కారు ఢీకొని ఓ చిన్నారి మృతి చెందింది. కీర్తన (6) రోడ్డును దాటుతూ వెళ్తుండగా.. అతివేగంగా వచ్చిన కారు ఢీ కొంది. ఈ ప్రమాదంలో చిన్నారికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ఆమెను దగ్గరలోని ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ చిన్నారి మృతి చెందింది. పోలీసుల పరిశీలనలో.. ప్రమాదానికి కారణమైన కారును ఒక డెంటల్ కాలేజీ విద్యార్థి నడిపినట్టు గుర్తించారు. కీర్తన తండ్రి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. ప్రమాదానికి కారణమైన కారును సీజ్ చేశారు. చిన్నారి మృతితో కుటుంబంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఘటనపై స్థానికులు, కుటుంబ సభ్యులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు భద్రతపై పోలీసులు మరింత కఠినంగా ఉండాల్సిన అవసరాన్ని గుర్తుచేస్తున్నారు.

## నగరంలో చైన్ స్నాచర్ల హల్‌చల్..

### బంగారం గొలుసు అపహరణ

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** నగరంలో చైన్ స్నాచర్లు రెచ్చిపోయారు. ఒకేరోజు మూడు చోట్ల దోపిడీకి యత్నించారు. నగరంలోని నాలుగో టౌన్ పోలీస్ స్టేషన్ పరిధి శ్రీనగర్ కాలనీలో గురువారం ఉదయం ఆరున్నర గంటల సమయంలో చైన్ స్నాచింగ్‌కు పాల్పడ్డారు. ఇద్దరు యువకులు బైక్‌పై వచ్చి స్థానిక మహిళ మెడలో ఉన్న మూడున్నర తులాల బంగారు గొలుసును లాక్కొని పారిపోయారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. అయితే అంతకు ముందు ఈ దొంగలు నగరంలోని మూడో టౌన్ దుబ్బ ప్రాంతంలో వాకింగ్ చేస్తున్న మహిళ మెడలో నుంచి బంగారు గొలుసు లాక్కెళ్లేందుకు యత్నించారు. కానీ, సదరు మహిళ వెంటనే అలెర్ట్ అయి గొలుసును గట్టిగా పట్టుకోవడంతో దొంగల ప్రయత్నం ఫలించలేదు. అక్కడి నుంచి గాయత్రీనగర్‌కు చేరుకున్న దుండగులు స్థానిక మహిళ మెడలో నుంచి కూడా చైన్ లాక్కెళ్లేందుకు ప్రయత్నించి, విఫలం అయ్యారు. ఇక, చివరగా శ్రీనగర్ కాలనీకి చేరుకుని చైన్ స్నాచింగ్‌కు పాల్పడినట్లు తెలుస్తోంది. కాగా.. మహిళ మెడలో నుంచి చైన్ లాగే ముందు దుండగులు హిందీలో మాట్లాడినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో చైన్ స్నాచర్లు మహారాష్ట్రకు చెందిన వారుగా అనుమానిస్తున్నారు. ఈ ఘటనలపై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఇప్పటికే సీసీటీవీ ఫుటేజీలను సేకరిస్తూ దొంగలను గుర్తించే ప్రయత్నాలను ముమ్మరం చేశారు. నగరంలో చైన్ స్నాచింగ్ ఘటనలు కొనసాగుతున్న నేపథ్యంలో స్థానికులు, మహిళలలో భయాందోళన పెరుగుతోంది.

## రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

**అక్షరటుడే, నిజామాబాద్ అర్బన్:** రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. ఇందుకు సంబంధించిన వివరాలను నిజామాబాద్ రైల్వే ఎస్సై వెల్లడించారు. రైల్వే డివిజన్ పరిధిలోని నిజామామాబాద్ - జానకంపేట్ రైల్వేస్టేషన్ల మధ్య గురువారం ఉదయం గుర్తుతెలియని రైలు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. సమాచారం అందుకున్న రైల్వే హెడ్ కానిస్టేబుల్ వరలక్ష్మి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతుడికి సంబంధించిన ఎలాంటి వివరాలు లభ్యం కాకపోవడంతో డెడ్‌బాడీని జీజీహెచ్‌కు తరలించామని.. రైల్వే స్టేషన్ మేనేజర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు రైల్వే ఎస్సై తెలిపారు. వివరాలకు 8712658591లో సంప్రదించాలని కోరారు.

## లారీని ఢీకొన్న ఆర్టీసీ బస్సు.. నలుగురికి గాయాలు

**అక్షరటుడే, కామారెడ్డి:** ఆగి ఉన్న లారీని ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఈ ఘటన దేవునిపల్లి సర్కిల్ లోని పొందుర్తి శివారులో జాతీయ రహదారిపై గురువారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పొందుర్తి శివారులో రోడ్డు పక్కన ఓ లారీ పార్క్ చేసి ఉంది. అయితే హైదరాబాద్ నుంచి బోధన్ వెళ్తున్న ఆర్టీసీ బస్సు పొందుర్తి శివారులో జాతీయ రహదారిపై ఈ ఆగిఉన్న లారీని ఢీకొంది. దాంతో బస్సు ముందు భాగం ధ్వంసమైంది. ప్రమాదంలో బస్సు ముందు భాగంలో కూర్చున్న నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. వారిని వెంటనే చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. ఘటనాస్థలాన్ని కామారెడ్డి రూరల్ సీఐ శ్రీధర్ గౌడ్, ఎస్సై రంజిత్ కుమార్ పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

